

## ఎమ్మెల్యే ధీరజ్‌మునిరాజ్‌ను అడ్డుకున్న డీసీపీ

**బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** బీజేపీ ఎమ్మెల్యే ధీరజ్‌మునిరాజ్‌ను విధానసౌధ వద్ద డీసీపీ అడ్డుకోవడం కలకలం రేపింది. శాసనసభలో బీజేపీ, జేడీఎస్ సభ్యులు రాత్రంతా ఆందోళన చేస్తుండగా, తూర్పువైపు ద్వారం మూసివేశారు. మరో మార్గం గుండా లోపలికి వెళ్లేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించారు. గమనించిన డీసీపీ.. ధీరజ్ మునిరాజ్‌ను అడ్డుకుని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ప్రతిపక్షనేత అశోక్ అక్కడికి చేరుకుని మండిపడ్డారు. తమ ఎమ్మెల్యేలను అడ్డుకుంటారనీ, పాకిస్తాన్ జిందాబాద్ అంటే మాత్రం వదులుతారని మండిపడ్డారు. ధీరజ్‌మునిరాజ్‌ను ఎమ్మెల్యే అనుకోలేదని డీసీపీ క్షమాపణలు చెప్పారు.

# ఢిల్లీనా.. గల్లీనా..?



కేంద్ర మంత్రి పదవితో హస్తినకు కుమారస్వామి

- పార్టీ పరిస్థితిపై ఆందోళన ● రాష్ట్రానికే ప్రాధాన్యం
- ఇవ్వాలంటున్న ముఖ్య అనుచరులు ● గందరగోళంలో మాజీ సీఎం



**బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో దాదాపు మూడు దశాబ్దాలకుపైగా క్రియాశీలకంగా వ్యవహరించి, జేడీఎస్ పార్టీకి కీలకనేతగా ఉండే కుమారస్వామి వ్యక్తిగతంగా కేంద్రప్రభుత్వంలో కీలకమైన మంత్రిగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు. అదనంగా ఆర్థికశాఖ కమిటీ సభ్యుడిగాను, తాజాగా నీతి ఆయోగ్ విభాగంలోనూ సభ్యుడు అయ్యారు. అయితే పూర్తిగా ఢిల్లీ రాజకీయాలకే పరిమితమైతే రాష్ట్రంలో పార్టీ పరిస్థితి ఏమవుతుందో అనే ఆలోచన ఆయన్ని వెంటాడుతోంది. ఢిల్లీలో ఉండాలా, కర్ణాటకపై దృష్టి సారించాల అనే గందరగోళంలో ఆయన ఉన్నారు. గతంలో రాష్ట్రానికి చెందిన తిరుగులేని రాజకీయ నాయకుడు, ఢిల్లీ రాజకీయాలవైపు వెళ్లి రాష్ట్రంలో పట్టు కోల్పోయినవారు ఉన్నారు. గతంలో హెచ్ఎన్ నంజేగౌడ, డాక్టర్ జీవరాజ్ ఆళ్వా, మాజీ సీఎం బంగారప్ప వంటి ప్రముఖులు తమకు అనుకూలంగా కాలానికి అనుగుణంగా సద్వినియోగం చేసుకుని ఆ తర్వాత బీజేపీ నిర్లక్ష్యం చేసిందనే విమర్శలు ఉన్నాయి. వాటిపట్ల కొంతముందస్తు ఆలోచనతోనే సంఘటనాత్మక అంశాలలో దూరం కాపాడుకుంటూనే వస్తున్నారు. అయితే ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు ముగిసింది.

కేంద్రంలో భారీ పరిశ్రమలశాఖ మంత్రి పదవికి దక్కింది. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులతో పోలిస్తే కుమారస్వామికి భారీగా ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో ప్రహ్లాద్‌జోషి పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు గనులశాఖ మంత్రిగా కేటాయించారు. ప్రస్తుతం ఆయనకు పౌర ఆహార సరఫరాలతోనే సరిపెట్టారు. ఇక మిగిలిన ఇద్దరు సోమణ్ణ, శోభాకరంద్లాజె సహాయమంత్రులుగా ఉన్నారు. కేంద్రంలో కీలకమైన పదవిలో ఉన్నా ఢిల్లీ రాజకీయాలు ఆయనకు సరిపోవడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఎక్కువ సమయం ఢిల్లీలోనే గడపాల్సి రావడంతో రాష్ట్ర రాజకీయాలవైపు దృష్టి సారించేందుకు సమయం చాలడం లేదు. అలాగని ఇతరులను నమ్మి పార్టీని అప్పగించే పరిస్థితి కూడా లేదు. మరోవైపు పార్టీకి మూలస్తంభమైన మాజీ ప్రధాని దేవెగౌడ వయో సమస్యలతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించే పరిస్థితి లేదు. ఢిల్లీలోనే ఉండిపోతే రాష్ట్రంలో పార్టీ పరిస్థితి ఏమిటో అన్న అయోమయంలో ఆయన ఉన్నారు. ఓ రకంగా ఆయన ఎటూ తేల్చుకోలేక ఇరుక్కుపోయినట్లయ్యింది. గత శాసనసభ ఎన్నికల్లో 19మంది ఎమ్మెల్యేలు గెలిచి పార్టీ మూడోస్థానంలోకి చేరినా, ఓడిపోయిన స్థానాల్లో ఓటింగ్‌శాతం తక్కువేమీ కాదు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయ పార్టీగా జేడీఎస్ బలోపేతమయ్యే అవకాశాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో చిత్రదుర్గ, తుమకూరుతోపాటు 8 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి జేడీఎస్ బలమే కారణమనేది ఓటింగ్‌శాతం ద్వారా రుజువైంది. భవిష్యత్తు దృష్ట్యా పార్టీ బలోపేతం చేయకుంటే రానున్న రోజుల్లో ప్రతి విషయం బీజేపీ ఎదుట విన్నవించుకునే పరిస్థితి వస్తుందని అత్యంత సన్నిహితుల వద్ద కుమారస్వామి అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ కారణంతోనే చన్నపట్టణ నియోజకవర్గం నుంచి కుటుంబీకులలో ఒకరిని పోటీ చేయించి గెలిపించుకోవాలని నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. చన్నపట్టణ ఎన్నికల్లో వరుసగా కుమారస్వామి గెలుపొందుతూ వచ్చారు. కానీ రానున్న ఎన్నికల్లో చన్నపట్టణ దక్కించుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ వ్యూహం పన్నారు. బెంగళూరు గ్రామీణ స్థానంలో తమ్ముడు డీకే సురేశ్ ఓటమికి సవాల్‌గా తీసుకోదలిచారు. మరోవైపు ఇదే స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపొంది మంత్రిగా రాణించి ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న సీపీ యోగేశ్వర్ బీజేపీ అభ్యర్థి అవుతారని ప్రకటించడం కూడా కుమారస్వామికి మింగుడు పడడం లేదు. మిత్రపక్షంగా ఉన్నప్పుడు సమష్టి నిర్ణయం తీసుకోకుండానే అభిప్రాయాలు వ్యక్తం చేయడంపై జేడీఎస్ వర్గాలు మండిపడుతున్నాయి. సీపీ యోగేశ్వర్‌ను పోటీ చేయిస్తే పరిషత్‌లో ఒక స్థానం తగ్గుతుందన్న ఆలోచన కూడా బీజేపీ, జేడీఎస్‌లు భావిస్తున్నాయి. అటువంటి రిస్క్ తీసుకునే ఆలోచనలో బీజేపీ నాయకత్వం లేదు. దీనికి తోడు యోగేశ్వర్‌పట్ల బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రతోపాటు పలువురికి ఆసక్తి లేదు. ఇలా యోగేశ్వర్‌ను అభ్యర్థిని చేసేందుకు ఎవరూ ఇష్టపడడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రమంత్రి వైభోగం కంటే రాష్ట్ర రాజకీయాలే సమంజసమని ఆలోచనలో కుమార ఉన్నట్లు తెలుస్తోంది. పలువురు ఆయన అనుచరులు కూడా పార్టీ అభ్యున్నతి పైనే దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో తిరిగి పట్టు సాధించడమే ధ్యేయమని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులూ అదే కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే రానున్న రోజుల్లో ఆయన ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది.

# రాత్రంతా సభలోనే..

- 'ముడా' అవినీతి ఆరోపణలపై ఆగని రగడ ● ప్లకార్డులతో బీజేపీ సభ్యుల ర్యాలీ ● సభలో నిరసనల హోరు

**బెంగళూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి):** శాసనసభ వర్షాకాల సమావేశాలలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 187 కోట్ల రూపాయల అవినీతి, మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో వేలకోట్ల రూపాయల ఇళ్లస్థలాల కుంభకోణంతోనే అట్టుడికింది. ముడాలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి పేరిట 14 స్థలాలు పొందిన విషయమై చర్చకు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన వినతిని స్పీకర్ తిరస్కరించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా శాసనసభ, విధానపరిషత్ అట్టుడికాయి. విచారణ దశలో ఉన్నప్పుడు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టరాదని స్పీకర్ చెప్పడంతో బీజేపీ, జేడీఎస్ సభ్యులు శాసనసభలోనే రాత్రంతా ధర్నా చేశారు. గురువారం ఉదయం శాసనసభ కలాపాలు ప్రారంభం కాగానే బీజేపీ, జేడీఎస్ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లి నిరసన కొనసాగించారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ సభ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. ఇదే సందర్భంలోనే ఆయన మాట్లాడుతూ ముడా విషయంలో ప్రత్యేక అవకాశం లేదని ప్రతిపక్ష సభ్యులు నిరసన చేయడం రాజకీయ నాటకమన్నారు. దీంతో సభ్యులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో గందరగోళం కొనసాగుతుండగానే పలు బిల్లులను ఆమోదింపచేశారు. రాష్ట్రంలో నీట్ పరీక్షల రద్దు, శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్ర ప్రతిపాదనకు వ్యతిరేకం, ఒకేదేశం - ఒకే ఎన్నికతో పాటు అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు ప్రత్యేక నిబంధనల బిల్లులకు ఉభయ సభలలో అంగీకారం తెలిపారు.

మరోవైపు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార విషయమై సమగ్ర చర్చ జరగాలని ప్రతిపక్షనేత అశోక్ అభ్యంతరం తెలపడంతో బెంగళూరు నగరాభివృద్ధి శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రత్యేక శాసనసభ కమిటీకి సిఫారసు చేశారు. దీంతో గ్రేటర్ బెంగళూరు అంశం తాత్కాలికంగా వాయిదా పడింది. సభలో ఏమాత్రం సాధారణ పరిస్థితి రాకపోవడంతో స్పీకర్ యూటీ ఖాదర్ పలుమార్లు వాయిదాలు వేశారు. అయినా శాసనసభలో మార్పు రాకపోవడంతో శాసనసభ కలాపాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. దీంతో శుక్రవారం ముగియాల్సిన శాసనసభ కలాపాలు ఒకరోజు ముందుగా వాయిదాపడ్డాయి. రెండోరోజు రాత్రి కూడా శాసనసభలోనే నిరసన కొనసాగించాలని భావించినా ప్రతిపక్షాలు ప్రభుత్వతీరుపై మండిపడ్డాయి. ఈనెల 15న శాసనసభ సమావేశాలు ఆరంభమయ్యాయి. మొహర్రం పండుగ సందర్భంగా ఒకరోజు కలాపాలకు బ్రేక్ పడింది. గతవారం శుక్రవారం దాకా కొనసాగింది. గతవారం వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతికి సంబంధించి నిరసనలతోనే కొనసాగగా సోమవారం నుంచి ముడా అక్రమాలపై సభ అట్టుడుకుతూ వచ్చింది. శుక్రవారం దాకా కలాపాలు సాగుతాయని అందరూ భావించారు. అయితే ఒకరోజు ముందుగానే సభ నిరవధిక వాయిదా పడింది. పరిషత్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగడంతో గందరగోళం మధ్యనే సభను వాయిదా వేశారు.

### చలో రాజ్‌భవన్ ర్యాలీ

కలాపాలు వాయిదాపడ్డంతో బీజేపీ, జేడీఎస్ సభ్యులు విధానసౌధ ప్రాంగణంలో ప్లకార్డులో నిరసన ర్యాలీ నిర్వహించారు. విధానసౌధ ప్రాంగణం నుంచి చలో రాజ్‌భవన్ చేపట్టారు. రాజ్‌భవన్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ముడాలో అక్రమాలు, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై రానున్న రోజుల్లో తీవ్రపోరాటం చేస్తామన్నారు. భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గవర్నర్‌కు రెండు అంశాలపైనా విన్నవించామన్నారు. సీఎం రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తుకు సూచించాలని గవర్నర్‌ను కోరామన్నారు. ప్రతిపక్షనేత అశోక్, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామితోపాటు దాదాపు సభ్యులందరూ నిరసనలో పాల్గొన్నారు.




ప్లకార్డులతో బీజేపీ నాయకుల నిరసన ర్యాలీ

## ఉధృతుంగా..

- ఉగ్రరూపం దాల్చిన తుంగభద్ర
- టీబీ డ్యాం 28 క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు విడుదల

**బళ్లారి, జూలై 25(ఆంధ్రజ్యోతి):** తుంగభద్రమ్మ ఉగ్రరూపం దాల్చింది. కర్ణాట, ఆంధ్ర రైతుల జీవనాడి నిండుకుండలా తొణికిసలాడుతోంది. డ్యాం పైప్రాంతం నుంచి జలాశయంలోకి ఇన్‌ఫ్లో 80 వేలకు పైగా క్యూసెక్కులుగా నమోదయ్యింది. అధికారుల లెక్కల ప్రకారం సాయంత్రం 4గంటలకు జలాశయంలో 102.57టీఎంసీల నీరు చేరింది. అప్రమత్తమైన అధికారులు జలాశయానికి ఉన్న 28 క్రస్ట్ గేట్లను తెరిచారు. 20 క్రస్ట్‌గేట్లను 2అడుగులు, 8క్రస్‌గేట్లను అడుగు తెరచి నదికి లక్ష క్యూసెక్కుల నీటిని మళ్ళించారు. ఏ క్షణమైన మరింత నీటిని నదికి విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. లక్ష నుండి లక్ష ఏభైవేల క్యూసెక్కుల వరకు ఏ క్షణంలోనైనా నదికి నీరు మళ్ళిస్తామని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు రాత్రి విద్యుత్ కాంతుల వెలుగులో డ్యామ్ మరింత అందంగా దర్శనమిచ్చింది.



విద్యుత్ వెలుగుల్లో టీబీ డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు



గేట్లు తెరవడంతో పరుగులు తీస్తున్న కావేరి

## నిండిన కేఆర్ఎస్

- లక్ష క్యూసెక్కుల నీరు విడుదల
- బృందావన్ గార్డెన్స్ గేట్ వద్ద ఆంక్షలు

**బెంగళూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి):** కావేరి నదీ పరీవాహక ప్రాంతంలో ఎగువన సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో కృష్ణరాజసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. కేఆర్ఎస్ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. గురువారం నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నారు. డ్యామ్‌కు రెండువైపుల కాలువలనుంచి నీరు విడుదల చేస్తున్నామని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్యామ్ ఇంజనీర్‌లు ప్రకటించారు. వేసవిలో దాదాపు ఎండిపోయిన స్థితిలో ఉన్న డ్యామ్‌కు ప్రస్తుతం వర్షాలతో జలకళ చేరిందన్నారు. కేఆర్ఎస్ డ్యామ్ గరిష్ఠ సామర్థ్యం 124 అడుగులకు 49.452 టీఎంసీలు కాగా దాదాపు చేరింది. బృందావన్ గార్డెన్స్‌కు వెళ్లే బ్రిడ్జినుంచి నీరు వెళ్తుండడంతో ఇక్కడ రాకపోకలపై ఆంక్షలు విధించారు.

## దర్శన్‌కు జైలు భోజనమే..

- పిటీషన్ కొట్టేసిన కోర్టు

**బెంగళూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి):** చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో జైలుపాలైన నటుడు దర్శన్‌కు పరప్పన అగ్రహార జైలు భోజనమే కొనసాగుతుంది. ఇంటి భోజనం, పరుపు, దుస్తులు కోరుతూ దర్శన్ దాఖలు చేసుకున్న పిటీషన్‌ను 24వ ఏసీఎంఎం కోర్టు కొట్టివేసింది. జైలు భోజనంతో అజీర్ణం, అతిసార అవుతోందని, శరీరం బరువు తగ్గుతున్నానని కారణాలు చూపుతూ ఇంటి భోజనానికి అనుమతి ఇవ్వాలని దర్శన్ తరపు న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేసుకున్నారు. గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి విశ్వనాథ్ సీ గౌడర్ తీర్పును ప్రకటించారు. హత్యకేసులో అరెస్టు అయినవారికి ఇంటిభోజనం, ఇతరత్రా సౌలభ్యాలకు అవకాశం లేదని, జైలు నిబంధనల ప్రకారం అక్కడి భోజనం, దుస్తులు మాత్రమే ఉపయోగించాలని సూచిస్తూ పిటీషన్‌ను కొట్టివేశారు. జైలు భోజనానికి సంబంధించి వైద్యులు ఎటువంటి సందేహం వ్యక్తం చేయలేదని, షూటింగ్ వేళ ఆయన గాయం ప్రస్తావన మాత్రమే చూపారని పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. దర్శన్‌కు బయటనుంచి భోజనం కల్పిస్తే ఎక్కడైనా పొరపాటు జరిగితే ఎవరు బాధ్యులని ప్రాసిక్యూటర్ అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# గ్రేటర్ బెంగళూరుకు తాత్కాలిక బ్రేక్..!

- సమగ్ర చర్చకు ప్రతిపాదనలు ● శాసనసభ కమిటీకి డీసీఎం డీకే సుముఖత



**బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లుకు తాత్కాలికంగా బ్రేక్ పెట్టారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికెలో మరిన్ని ప్రాంతాలను విలీనం చేసి గ్రేటర్ బెంగళూరు ఏర్పాటు చేయాలనే బిల్లుకు శాసనసభలో మూడురోజుల కిందటే అంగీకారం తెలిపింది. అయితే సమగ్ర చర్చ లేకుండా బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా సాగుతున్న తరుణంలోనే బెంగళూరు నగరాభివృద్ధి శాఖా మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ గురువారం ప్రత్యామ్నాయ సవరణ చేశారు. అంతకుముందు ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ బిల్లుపై చర్చ జరగాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉండే రూపంలోనే బిల్లు అమలు చేస్తే బెంగళూరు ఛిద్రం కానుందన్నారు. బిల్లును వాపసు తీసుకోవాలని శాసనసభ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యుడు ఎస్‌టీ సోమశేఖర్ సమగ్ర చర్చ అవసరమని ప్రతిపాదించారు. ఇందుకు డీకే శివకుమార్ మాట్లాడుతూ గ్రేటర్ బెంగళూరు విషయమై సమగ్ర చర్చ జరగాలని సభ్యులు కోరినందున శాసనసభ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. దీంతో తాత్కాలికంగా గ్రేటర్ బెంగళూరుకు బ్రేక్ పడినట్లు అయ్యింది.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1631.91 | 1,606.78 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 75,810 | 72,489 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 23,469 | 205 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 101.42 | 31.66 |

## జేడీఎస్‌లోకి చిక్కబళ్లారి గ్రామస్థులు



జేడీఎస్ పార్టీలో చేరుతున్న చిక్కబళ్లారి వాసులు

**సిరుగుప్ప, జూలై 25 :** జేడీఎస్ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ సమక్షంలో ఇతర పార్టీలకు చెందిన చిక్క బళ్లారి గ్రామస్థులు 25మంది జేడీఎస్ పార్టీలో చేరారు. శాలువాలు, పూలమాలలతో వారిని శివనారాయణ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జేడీఎస్ పార్టీ ప్రముఖులు దేవన్న, ముదుకప్ప, రంగప్ప, వెంకన్న, దొడ్డ ఈరప్ప, మహాదేవ పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాటర్ బాటిళ్ల అందజేత



వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

**బళ్లారి రూరల్, జూలై 25 :** బళ్లారి నగరం అల్లి పురం సమీపంలో ఉన్న అనాథాశ్రమంలోని విద్యార్థులకు గురుపౌర్ణమి సందర్భంగా మాతృ మహిళా మండలి అధ్యక్షురాలు పుష్ప, చంద్రశేఖర్ అన్నం తినే సమయంలో తాగడానికి ఉపయోగించే వాటర్ బాటిల్స్ అందించారు. ఈ సందర్భంగా గురుపూర్ణిమ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సుగుణ, మధుతో పాటు అనాథ విద్యార్థులు పాల్గొన్నారు.

## కొల్లిపీర్లకు ప్రత్యేక పూజలు



మౌలాలి స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**బళ్లారిరూరల్, జూలై 25:** బళ్లారి నగరం మటన్ మార్కెట్ సమీపంలో ఉన్న మౌలాలీ పీర్లస్వామికి భక్తులు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు సునీల్, ఆదిత్య అభిసయ్యద్, ఖాజా హుస్సేన్, అనీఎఫ్, నజీర్, ఖాదర్‌గౌస్, శబరి, అలీ తదితరులు పాల్గొన్నారు.

## సేవకు మారుపేరు బంగారు శ్రీనివాస్



అన్నదానం చేస్తున్న బంగారు శ్రీనివాస్ దంపతులు

**బళ్లారి సిటీ, జూలై 25:** వ్యాపార లాభంలో కొంత సమాజసేవకు అన్నదానాలు, పేదల పెళ్లిళ్లకు సహాయం చేసే వారుఎందరో ఉంటారు. సమాజసేవ చేయాలనే తపన కొందరికి మాత్రమే ఉంటుంది. ఆకోవకు చెందిన వారే బంగారు శ్రీనివాస్. బళ్లారిలో చిన్నగా బంగారు వ్యాపారం ప్రారంభించి ఇక్కడే స్థిరపడి అంచెలంచలుగా ఎదిగారు. వ్యాపారంలో వచ్చిన లాభంలో అంతా స్వంతానికి కాకరుండా సమాజ సేవకు కూడా కొంతభాగాన్ని ఉపయోగించాలని సంకల్పించి గత పది ఏళ్ళుగా నగరంలోని కోటప్రాంతంలో వెలసిన షిరిడీసాయిబాబా ఆలయం వద్ద ప్రతి గురుపౌర్ణమికి మిత్రబృందంతో వేలాది మందికి అన్నదానం చేస్తున్నారు. ప్రతి గురువారం బాబా ఆలయం వద్ద, ఇక అమావాస్య తదితర రోజుల్లో విమ్స్ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నారు. అంతేకాకుండా పేదల పెళ్ళిలకు తాళిబొట్లు ఉచితంగా అందజేస్తూ బంగారు శ్రీనివాస్‌గా పేరు గడించారు. ఆయనది అమృత హస్తమని కూడా పేరురావడం విశేషం. ప్రతి గురువారం నగరంలోని ఇంటి వద్ద తయారు చేసిన ఆహార పధార్థాలను స్వయంగాతీసుకెళ్ళి వందలాది మందికి వారే వడ్డిస్తారు.. స్వగ్రామం గుంటూరుజిల్లా తెనాలి కావడంతో అక్కడ ప్రతి శుక్రవారం అమ్మవారిఆలయంలో అన్నదానం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో వృద్ధాశ్రమం, గోశాల ఏర్పాటు చేసి తమసేవలను విస్తరిస్తామన్నారు. ప్రజాసేవ చేయడంలో తమ కుటుంబసభ్యులు కూడా తమతో పాలు పంచుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని తెలిపారు.

హంపి కోదండరామాలయాన్ని తాకుతూ పరుగులు తీస్తున్న తుంగ



# తుంగభద్ర పరవళ్లు

- 28 గేట్ల ద్వారా నీటి విడుదల
- నది వద్దకు వెళ్లరాదంటూ దండోరా
- తెప్పలను ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులు

**కంప్లి, జూలై 25:** తుంగభద్ర జలాశయం పూర్తిగా భర్తీ కావడంతో అధికారులు గురువారం సాయంత్రం జలాశయం నుంచి 75,810 క్యూసెక్కుల నీటిని 28 గేట్ల ద్వారా విడుదల చేశారు. ఇప్పటికే నదీప్రాంత గ్రామాలకు ముందు జాగ్రత్త హెచ్చరికలు కూడా చేశారు. హంపి పుణ్యక్షేత్రం వద్ద కోదండ రామస్వామి ఆలయాన్ని తాకుతూ తుంగభద్ర పరుగులు తీస్తోంది. కంప్లి కోట ప్రాంతాన్ని ఒరుసుకుంటూ ప్రవహిస్తోంది. అధికారులు కూడా ముందస్తు జాగ్రత్తల కోసం గ్రామాల్లో దండోరాలు వేయిస్తూ నది ఒడ్డుకు పశువులు గానీ, రైతులుగాని తమ పనులకు వెళ్లరాదంటూ సూచించారు. నదికు నీరు పోటెత్తడంతో కంప్లి తాలుకా పరిధిలోని గ్రామాల నుంచి ప్రజలు తిలకించేందుకు తండోపతండాలుగా వస్తున్నారు. నదిలో ఎక్కువగా నీరు రావడంతో మత్స్యకారులు వారి తెప్పలను ఒడ్డుకు చేర్చారు. మరో రెండు రోజుల పాటు మరిన్ని గేట్లు తెరచి నదికి ఎక్కువ నీరు వదిలే అవకాశం వుందన్నారు.



వరద కారణంగా ఒడ్డుకు చేర్చిన తెప్పలు

# వర్షాలతో తస్మాత్ జాగ్రత్త!

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- తహసీల్దారు హెచ్చరిక

**కంప్లి, జూలై 25 :** ప్రకృతి వైపరీత్య సమయంలో ఏ శాఖ సిబ్బంది, అధికారులైనా సరే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ శివరాజు హెచ్చరించారు. కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం వివిధ శాఖల అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్, పంచాయతీ రాజ్, పోలీసు, ఆరోగ్య, వెటర్నరీ, పశు శాఖ, ఆహార శాఖ, ఇతర శాఖల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలవల్ల శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను, పాఠశాలలు, అంగన్‌వాడీలను తనిఖీ చేసి వెంటనే జాబితా రూపొందించాలన్నారు. నది ఒడ్డున పంటలు నష్టపోయిన, ఇళ్లు కూలిన వారి వివరాలను వెంటనే తెలియజేయాలన్నారు. ఇలాంటి విధులలో సిబ్బంది నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కంప్లి కోటలో గంజి కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. అందులో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. వారితో పాటు ముఖ్య అధికారి దుర్గన్న, సీఐ వాసుకుమార్, శ్రీకుమార్, ఏడీ మల్లన్న గౌడ, డీటీ రవీంద్ర కుమార్, షణ్ముఖప్ప, శ్రీధర్, బసవరాజు, రమేష్, బసవ, తదితర శాఖల అధికారులు, పీడీవోలు పాల్గొన్నారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

# నగరంలో లారీ యజమానుల సమ్మె

**బళ్లారిరూరల్, జూలై 25 :** బళ్లారి జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షులు మించు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నూర్ మహమ్మద్ అధ్యక్షతన గురువారం లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీల సమ్మె చేపట్టారు. బెంగళూరు రోడ్డు హలకుంది మఠం సమీపంలో లారీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మించు శ్రీనివాస్ మాట్లాడుతూ.. లారీ ఓనర్లకు కనీస గిట్టుబాటు ధర లేక ఇబ్బందులకు గురవుతున్నారని లారీలకు కనీసం బాడుగలు లేక గిట్టుబాటు కాక ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాలన్నా చాలా దుర్భరంగా ఉందని తెలిపారు. స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలకు సంబంధించి ఐరన్ ధరలు పెంచాలని లోడింగ్ ధరలు గిట్టుబాటు కావడం లేదని దీనికి తోడుగా డీజిల్ రేటు అధికం కావడంతో దీనిపైనే జీవనం సాగిస్తున్నామని లారీ ఓనర్లు గురువారం సమ్మె చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు సమ్మె చేస్తామని లారీ ఓనర్లు తెలుపగా స్పందించిన కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా హలకుంది మఠం చేరుకుని లారీ ఓనర్లతో మాట్లాడారు. ఐరన్ ఓర్ లోడింగ్ గురించి అనుకూలమయ్యేలా చేస్తానని చెప్పారు. లారీ ఓనర్లను, లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిని సోమవారం కలెక్టర్ కార్యాలయానికి రావాలని కోరారు. వారి సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ ఎస్‌బీఐ కేపీ రవి కుమార్, డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, సతీష్, కార్పొరేటర్ ప్రభంజన్ కుమార్, లారీ అసోసియేషన్ సభ్యులు నీలకంఠ, రామ్‌కుమార్, పూజ, దేవి, శ్రీనివాస్, నరసింహులు, ఫయాజ్, వెంకటేష్, సంతోష్, తదితర లారీ ఓనర్లు పాల్గొన్నారు.



సమ్మె కారణంగా బళ్లారి హలకుంది మఠం వద్ద నిలిచిపోయినలారీలు

# వైద్యుల సలహా లేకుండా స్కానింగ్ చేయొద్దు

- ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు

**బళ్లారి సిటీ, జూల్యై 25:** వైద్యుల సలహాలేకుండా ప్రజలు అనవసరంగా స్కానింగ్ చేయించుకోవద్దని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అబియాన్ కింద జిల్లా వ్యాప్తంగా ఆపదలో ఉన్న గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం సిద్దమ్మనహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి బాలింతలతో స్వయంగా మాట్లాడారు.

ఆడపిల్లలకు 18ఏళ్ళు నిండిన తర్వాతే పెళ్ళిచేయాలని, గర్భిణీ అని తెలిసిన వెంటనే ఆరోగ్య శాఖలో రిజిస్టర్ చేసుకుని మదర్స్ కార్డ్ పొందాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిష్ణాతులైన వైద్యులు, సిబ్బందితో ఉచిత ప్రసవాలు చేస్తున్నారన్నారు. దీంతో పాటు ఆసుపత్రుల్లో శిశువుకు వెచ్చని వాతావరణం కల్పించేందుకు బేబీ వార్మర్ సౌకర్యాలు ఉన్నాయని, శిశు సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గర్భిణులు స్థానికంగా లభించే కూరగాయలు ఆకు కూరలు పప్పు దినుసులు మొలకలు, ఐరన్ మాత్రలను రోజు తీసుకోవాలన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరీక్షల్లో తేలిన అనారోగ్య సమస్యలకు తగిన చికిత్స అందించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గర్భవతి అని తెలిసిన తరువాత రెండున్నర నెలల నుంచి మూడున్నర నెలల తర్వాత మొదటి సారి, నాలుగైదు నెలలు నుంచి ఐదున్నర నెలల తర్వాత రెండోసారి ఎనిమిదిన్నర నెలల తర్వాత మూడోసారి స్కానింగ్ చేయాలన్నారు తొమ్మిదవనెలలో అవసరమైతే మాత్రమే నిపుణుల సలహా మేరకు అదనపు స్కానింగ్ చేయాలన్నారు. ఈసందర్భంగా సిద్దమ్మన హళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివ్య, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, పార్మసిస్టు వీణ,నర్సు సునీత, వైద్య ప్రయోగ పాఠశాల టెక్నీషియన్ శ్వేత పాల్గొన్నారు.



ప్రజలకు సూచనలు ఇస్తున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

# మెగా పనస!



భారీ పనస కాయతో చిన్నపిల్లప్ప

**హోసూరు, జూలై 25:** పనస తొనలకన్న, నెచ్చెలి మోవి కన్న మధురమైంది మరేదీ లేదన్నాడు కవి. హోసూరు సమీపంలోని గుడి సాకనపల్లెలో ఓ పనస చెట్టుకు కాస్తున్న మధురమైన భారీ పండ్లను చూస్తే మాత్రం పనస తొనలను వదిలిపెట్ట బుద్ధి కాదు. ఆ చెట్టు యజమాని చిన్నపిల్లప్ప తాతముత్తాతల కాలంనాటి నుంచి ఆ చెట్టుకు ఎక్కువ కాయలు కాయడం పరిపాటేనట. గత 5, 6 సంవత్సరాలుగా మరీ భారీ కాయలు కాస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రతి ఏటా తమ చెట్టుకు 20 కాయలకు పైగా కాస్తున్నాయని, ఒక్కో కాయ సుమారు ఎనభై కిలోల బరువు తూగుతుందన్నారు. ఏ చెట్టుకైనా కాలం గడిచేకొద్దీ కాపు తగ్గుతూ వస్తుందని, కాని తమ చెట్టుకు మాత్రం కాపు పెరుగుతోందన్నారు. చెట్టును గత 70 సంవత్సరాలుగా రక్షిస్తూ వస్తున్నామన్నారు. ఇంత వరకు ఈ చెట్టుకు కాసే పండ్లు ఒక్కటి కూడా విక్రయించలేదని, అందరికి ఉచితంగానే ఇస్తున్నామన్నారు. ఏటా మొదట కాసిన పండును ఆంజనేయస్వామి దేవాలయానికి అందించి పూజలు నిర్వహిస్తామని, తర్వాతే అందరికీ పంచుతామన్నారు.

## ప్రతి వ్యక్తి తాత్విక సిద్ధాంతాలను పాటించాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ సిద్ధరామ జగన్నాథ పండితారాధ్యులు

**సిరుగుప్ప, జూలై 25:** మనిషి ఉత్తమ మార్గాన్ని ఎన్నుకొని, తాత్విక సిద్ధాంతాలను పాటించాలని శ్రీశైలం జగద్గురు డాక్టర్ సిద్ధరామ జగన్నాథ పండితారాధ్యులు తెలిపారు. సిరుగుప్ప పట్టణం వినాయకుని ఆశ్రమంలో గురువారం జీవన తత్వాల విషయంపై ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామి మాట్లాడుతూ, నేటి కాలంలో ప్రజలు ప్రతి ఒక్కరు కర్మ సిద్ధాంతాలను తెలుసుకోవాలన్నారు. ఇతరులకు సహాయపడే జీవితాన్ని అలవరుచుకోవాలన్నారు. ఆలయాలు, విద్యా మందిర్‌లకు, మఠాలకు తన వంతు సహకారం అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ స్వామి, బసవనగౌడ, రామస్వామి, బసలింగప్ప, ఆశ్రమ సమితి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్లో పార్లమెంట్ ఏర్పాటు



స్కూల్ పార్లమెంట్ సమావేశం

**బళ్లారి సిటీ, జూలై 25:** నగరంలోని నారాయణ పాఠశాలలో 2024-25 వ సంవత్సరానికిగాను విద్యార్థులచే స్కూల్ పార్లమెంట్ ఏర్పాటు చేశారు. నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నారులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ప్రారంభించిన ట్రాఫిక్‌పోలీస్ అధికారి అయ్యనగౌడ వి.పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. శ్రీమతి రజని మాట్లాడుతూ నారాయణ పాఠశాలలో అన్నివసతులతో పాటు పిల్లల్లో నాయకత్వం, క్రమశిక్షణ సామాజికస్పృహ పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలో అగ్ని, పృథ్వి, నాగ్, త్రిసూల్, టీముల విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు పంపిణీచేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏజీఎం లవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి సుష్మ, అకడమిక్ డీన్ షేక్ అహ్మద్, ట్రాఫిక్ పోలీస్ పిఎస్ఐ మహ్మద్ షఫీవుల్లా పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో దెబ్బతిన్న ఆకుకూర పంటలు



తెగులు సోకిన ఆకుకూరను కోస్తున్న రైతు

**కంప్లి, జూలై 25:** పట్టణ పరిధిలోని బెళగోడుహాళ్, కంప్లి కోటె పరిధిలో వర్షాల కారణంగా ఆకుకూర పంటకు పురుగు సోకి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కంప్లి కోట వద్ద వున్న వరసిద్ది వినాయక ఆలయ పరిధిలో ఆకుకూరలు పెంచుతున్న రైతన్నలు వర్షాల ప్రభావంతో పురుగు సోకి పూర్తిగా నష్టపోయారు. ఈ సందర్భంగా రైతు విరుపన్న మాట్లాడుతూ.. ఎకరం రూ.30 వేలు వంతున కౌలుకు తీసుకుని అందులో పాలకూర, మెంతికూర, తోటకూర, గోంగూర తదితర ఆకుకూరలు వేసుకుని సాగు చేస్తున్నామని, కానీ ఖరీఫ్‌లో వర్షాల ప్రభావంతో పంటకు పురుగు, వైరస్‌లు సోకి పూర్తిగా నష్టపోయామన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాక పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకుకూర పండించే రైతులకు కూడా ప్రభుత్వాలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

# హోసూరు జోన్

## ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం



దేవాలయ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

**హోసూరు, (కృష్ణగిరి) జూలై 25:** ఆక్రమణకు గురైన ఆలయ భూముల స్వాధీనం కొనసాగుతుందని హిందూ ధర్మాదాయ శాఖ మంత్రి తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం పంచాయతీ యూనియన్, బాలేగులి వెంకటాచలపతి ఆలయం, పట్టాలమ్మ ఆలయం, కెలమంగలం పంచాయతీ యూనియన్, నాగమంగలం హనుమంతరాయ స్వామి ఆలయాలకు సంబంధించిన 7 ఎకరాల స్థలాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించిన స్థలాలను గ్రానైట్ రాళ్లు, చెత్త వేయడానికి ఉపయోగిస్తున్నారని తెలుసుకుని క్షేత్రస్థాయిల్లో సర్వే నిర్వహించి హిందూ ధర్మాదాయ శాఖ తరపున ఫిర్యాదు చేశారన ఇప్పుడు కేసు కోర్టుకు వెళ్లడంతో ఆ శాఖ తరపున తీసుకున్న చర్యలను కోర్టుకు నివేధికగా సమర్పించామన్నారు. కోర్టుల్లో తదుపరి విచారణ కొనసాగుతోందని, హిందూ మత సంక్షేమ సంఘం తరపున దాఖలైన ఫిర్యాదుపై కూడా విచారణ జరుగుతోందన్నారు. విచారణకు హిందూ మత సంక్షేమ శాఖ ప్రాంతీయ జాయింట్ కమీషనర్ సుదర్శన్, జిల్లా ట్రస్టీ కమిటీ ఛైర్మెన్ రజినీ సెల్వం, డాక్టర్ బి.జయపాల్, మినరల్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంటల్ డిప్యూటీ డైరెక్టర్ అధికారులు హాజరయ్యారు.

## గుట్కా స్వాధీనం: ఇద్దరి అరెస్ట్

**హోసూరు,(క్రైం) జూలై 25 :** హోసూరు టౌన్ పోలీసులు బస్‌స్టాండులో గస్తీ నిర్వహిస్తుండగా, అక్కడ అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను గమనించి సోదా చేశారు. వారి వద్ద 12 కిలోల నిషేధిత పొగాకు ఉత్పత్తులు గుట్కా ఉన్నట్లు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి విచారణ చేయగా విచారణలో వారు తిరువణ్ణామలై జిల్లా రెడ్డిపాళయంకు చెందిన శివాజీ (36), తేని జిల్లాకు చెందిన మల్లిక (39) గా గుర్తించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. గుట్కాను కూడా స్వాధీనం చేసుకున్నారు.

## డీఎండీకే పార్టీ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న డీఎండీకే కార్యకర్తలు

**హోసూరు, జూలై 25:** హోసూరులో విద్యుత్ చార్జీలు పెంచారని, రేషన్ షాపుల్లో సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, జాతీయ ప్రగతిశాల డి.ఎండి.కే పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్ ఆదేశాల మేరకు ఈ ప్రదర్శన జరిగింది. నిరసన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి రామస్వామిరెడ్డి అధ్యక్షత వహించారు. నెలల తరబడి కావేరి నీటిని సక్రమంగా అందించని కర్ణాటక ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, తమిళనాడుకు కావేరి నీటిని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అందించాలని పలు డిమాండ్లతో నిరసన చేపట్టారు. శరవణన్ నాయకత్వం వహించారు. నిరసనలో జిల్లా ఉప కార్యదర్శులు వెంకటేశ్, రాజశేఖర్, వడివేలు, సంయుక్త కార్యదర్శులు కళాకంద్రాయన్, అప్పయ్య, కార్యవర్గ సభ్యులు మణి, మంజు వినాయకమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన శీలహళ్లి వంతెన

**రాయచూరు, జూలై 25:** కృష్ణానదికి వరద ఉధృతి పెరగడంతో గురువారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా పరిధిలో ఉన్న శీలహళ్ళి వంతెన నీట మునిగింది. దీంతో శీలహళ్ళి హంచినాళ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోగా అధికారులు నది తీరంలో ఉన్న గ్రామాలను మరోసారి హెచ్చరించారు. లింగసుగూరు, దేవదుర్గ, రాయచూరు తాలూకాలోని కృష్ణానదితీరంలో ఉన్న గ్రామాలన్నింటికి పశువులను నదిలోకి వెళ్లనివ్వద్దని పంప్‌సెట్‌లను తొలగించుకోవాలని సూచించారు. కాగా గురువారం కృష్ణానదిలో నారాయణపూర్ నుంచి 2.43 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



శీలహళ్లి వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీరు

## ప్రియురాలితో కలిసి భార్య చేతికి చిక్కిన పోలీస్..!

**రాయచూరు, జూలై 25 :** తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం నెరుపుతూ ఒకే గదిలో ఉండడాన్ని గమనించిన అతడి భార్య నేరుగా ఆ ఇంటికి తాళం వేసి ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనూహ్య సంఘటన గురువారం జిల్లాలోని సిరవార పట్టణంలో చోటు చేసుకుంది. సిరవార స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజ్ మహ్మద్ వైద్య ఆరోగ్య శాఖలో నర్సుగా పని చేస్తున్న మరో మహిళతో ఒకే ఇంట్లో ఉన్నట్లు గుర్తించిన హెడ్‌కానిస్టేబుల్ భార్య నేరుగా అక్కడికి వెళ్లి ఆ ఇంటికి తాళం వేసింది. విషయాన్ని జిల్లా ఎస్పీకి ఫోన్ ద్వారా వివరించగా వెంటనే స్పందించిన ఎస్పీ సిరవార ఎస్ఐకు ఇచ్చిన ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ రాజ్ మహ్మద్‌ను అతని ప్రియురాలిని స్టేషన్‌కు తీసుకొచ్చిన ఎస్ఐ ముగ్గురిని కూర్చోబెట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బయటి ప్రపంచానికి తెలిసిపోయింది. రాజ్ మహ్మద్ గతంలో కవితాళ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా అక్కడే పీహెచ్‌సీలో పని చేస్తున్న ఒక మహిళ నర్సుతో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఇటీవలే కవితాళ నుంచి సిరవారకు బదిలీ అయిన రాజ్ మహ్మద్ తన ప్రియురాలితో ఉన్న సంబంధాన్ని మాత్రం యధావిధిగా కొనసాగిస్తున్నారు.




ఇంటికి తాళంవేసి పోలీసులను రప్పించిన మహిళ

## నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### జార్జ్ బెర్నార్డ్ షా (జయంతి)



ప్రపంచంలో నోబెల్ పురస్కారంతోపాటు ఆస్కార్ అవార్డు పొందిన ఏకైక వ్యక్తిగా నిలిచిన ఐరిష్ దేశానికి చెందిన సాహితీ వేత్త జార్జ్ బెర్నార్డ్ షా 1856 జులై 26న డబ్లిన్‌లో జన్మించారు. 20వ యేట లండన్‌కు వెళ్లి తన జీవితమంతా అక్కడే గడిపారు. 60కి పైగా నాటకాలు రాశారు. సీజర్ అండ్ క్లియోపాత్ర, మ్యాన్ అండ్ సూపర్‌మ్యాన్, మేజర్ బార్బరా, హార్ట్‌బ్రేక్ హౌస్ తదితర రచనలు ఎంతో పేరొందాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను స్పృశిస్తూ రచనలు చేశారు. 1950 నవంబరు 2న కన్నుమూశారు.

### గోరా శాస్త్రి (వర్ధంతి)



'గోరా'గా పేరొందిన గోపరాజు రామచంద్రరావు 1902 నవంబరు 15న ఒడిశా రాష్ట్రం ఛత్రపురంలో జన్మించారు. సంఘ సంస్కర్త, హేతువాదిగా రాణించారు. సమాజంలో వర్ణవ్యవస్థ, అంటరానితనంపై యుద్ధాన్ని ప్రకటించి 1940లో ప్రపంచంలో తొలి నాస్తిక కేంద్రాన్ని స్థాపించారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలు నిర్వహించారు. ఎన్నో రచనలు చేశారు. మహాత్మాగాంధీతో చర్చించి అస్పృశ్యత నిర్మూలన కోసం కృషి చేశారు. సాంఘిక సమానత్వ సాధనకు కృషి చేశారు. 1975 జులై 26న కన్ను మూశారు. 2002లో ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

# ముడాపై ఆగని రగడ

● రెండో రోజూ అట్టుడికిన ఉభయసభలు ● పోటాపోటీగా పాదయాత్ర చేపట్టనున్న కాంగ్రెస్, బీజేపీ

**బెంగళూరు, జులై 25(ఆంధ్రజ్యోతి):** మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుటుంబీకులు ఏకంగా 14 స్థలాలను పొందడాన్ని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌ల పార్టీలు తీవ్రంగా భావిస్తున్నాయి. వారం రోజులుగా శాసనసభ ఉభయసభల్లోనూ ఆందోళనలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల సభ్యులు బుధవారం రాత్రి నుంచి ఏకంగా శాసనసభలోనే నిద్రించి నిరసన సాగించారు. శుక్రవారంతో శాసనసభ ముగియనుండటంతో తదుపరిగా బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. ముడా అవినీతి ద్వారా ఏకంగా నాలుగువేల కోట్ల మేర అవినీతి జరిగిందని ప్రతిపక్ష పార్టీల నేతలు వాదిస్తున్నారు. సీఎం భార్య పేరుతో 14 ఇంటి స్థలాలు పొందడం ద్వారా కోట్లాది రూపాయలు లబ్ధి పొందారని సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. మరో వైపు సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నారు. శాసనసభ సమావేశాలు ముగియగానే బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేయదలచారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులతో పాటు వేలాది మంది కార్యకర్తల ద్వారా పాదయాత్ర చేపట్టనున్నారు. ఇంకా తేదీ ఖరారు చేయలేదు.

### బెంగళూరుకు కాంగ్రెస్ పాదయాత్ర

ముడా అక్రమాలపై బీజేపీ, జేడీఎస్ పాదయాత్రకు సిద్ధమైతే అందుకు దీటుగా అధికార కాంగ్రెస్ కూడా పాదయాత్ర చేయాలని నిర్ణయించింది. గడిచిన మూడున్నరేళ్ల బీజేపీ ప్రభుత్వంలో ఏకంగా 23 విభాగాలలో అవినీతి జరిగిందని వీటిని నిరసిస్తూ మైసూరు నుంచి బెంగళూరుకు పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. బీజేపీ బెంగళూరులో పాదయాత్ర ప్రారంభించిన రోజునే కాంగ్రెస్ మైసూరులో పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. ఇలా మరి కొన్ని రోజుల్లోనే నేతలంతా పాదయాత్రలతో బిజీ కానున్నారు. మొత్తానికి ఎన్నికలు ముగిసినా రాష్ట్రంలో ఎన్నికల వేడి తగ్గేలా లేదు.



సభలో నినాదాలు చేస్తున్న బీజేపీ సభ్యులు



మాట్లాడుతున్న జిల్లా ప్లానింగ్ అధికారి ప్రమోద్

### సృజనాత్మక నైపుణ్యంతో
## స్వయం ఉపాధి

● జిల్లా ప్లానింగ్ అధికారి ప్రమోద్

**బళ్లారి సిటీ, జులై 25:** యువత స్వయం ఉపాధిని చేపట్టేందుకు సృజనాత్మకతతో కూడిన నైపుణ్య శిక్షణ ఇవ్వాలని జిల్లాపంచాయతీ ప్లానింగ్ అధికారి ప్రమోద్ అన్నారు. కెనరాబ్యాంక్ గ్రామీణ స్వయం శిక్షణ సంస్థ ఆవరణలో 30రోజుల బ్యూటీ పార్లర్ శిక్షణ, 10రోజుల పాటు గొర్రెల పెంపకంలో శిక్షణను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఈరోజుల్లో మహిళలు అందానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నందున బ్యూటీ పార్లర్‌లో రకరకాల మేకప్ స్కిల్స్ ప్రాక్టీస్ చేయాలన్నారు.. అదేవిధంగా గొర్రెల పెంపకం వ్యవసాయానికి పరిపూరకరమైనదని, గొర్రెలకు చాలా డిమాండ్ ఉందన్నారు. జిల్లాపారిశ్రామిక కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అజిత్ నాయక్ మాట్లాడుతూ, మహిళలు ఇంట్లోనే కూర్చుని బ్యూటీ పార్లర్లు నడపవచ్చన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజసాబు మాట్లాడుతూ, నైపుణ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన సమాచారం ఇస్తున్నారని వీటిని వృత్తి జీవితంలో పెంపొందించుకోవాలన్నారు. ఈసందర్భంగా రవివర్మ, శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త జడెప్ప, సిద్ద లింగమ్మ, సంతోష్‌కుమార్, జిల్లాపంచాయితీ కిరణ్‌కుమార్‌తో పాటు 60మంది శిక్షణార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థిపై నల్లముచ్చు దాడి

**కంప్లి, జులై 25 :** చిన్నారులపై నల్లముచ్చు కోతులు దాడులు పెరిగిపోయాయి. పట్టణం లోని షుగర్ ఫ్యాక్టరీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో నల్లముచ్చు కోతులు విద్యార్థులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. గురువారం ఉదయం రెండవ తరగతి చదువుతున్న వీరేష్ అనే విద్యార్థిపై నల్లముచ్చుకోతి దాడి చేసి గాయపరిచింది. దీంతో విద్యార్థులు పాఠశాలకు రావాలన్నా భయాందోళన చెందుతున్నారు. కోతుల బెడద కారణంగా తమ పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వెనుకంజ వేస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వెంటనే నల్లముచ్చుకోతులను బంధించాలని కోరారు. ఇప్పటికే పలుసార్లు దాడులు చేసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీప కొండల్లోంచి అధికంగా కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయని, వాటిని బంధించి అడవికి తరలించాలని వారు కోరారు.



నల్లముచ్చు కోతి దాడిలో గాయపడిన విద్యార్థి

## కుమారస్వామి కొండలో
# చిరుత ప్రత్యక్షం

**బళ్లారిరూరల్, జులై 25 :** బళ్లారి జిల్లా సండూరు తాలుకా కుమారస్వామి దేవస్థాన ప్రధాన రహదారి కొండలు చిరుతపులి కనిపించడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం కొందరు వాహనదారులు కొండలోకి వెళ్తున్న సమయంలో రోడ్డు పక్కన చిరుతపులి కనిపించింది. పర్యాటకులు కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. కుమారస్వామి కొండలో చిరుతపులి కనిపించడం ఇదే తొలిసారి అని పలువురు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే చిరుతను బంధించి అడవికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



పొదల మధ్యలో కనిపించిన చిరుత

# కళలతో వ్యక్తిత్వ వికాసం: ఎమ్మెల్యే



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్

**బెంగళూరు, జులై 25 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు తమ జీవనంలో కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమని ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ అభిప్రాయపడ్డారు. బసవనగుడి నేషనల్ కళాశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థుల అభిరుచిని ప్రోత్సహిస్తారని తాను కూడా ఇక్కడే చదివానన్నారు. డాక్టర్ హెచ్ నరసింహయ్య వంటి వారి ఆదర్శాలు తమపై ఉన్నాయన్నారు. విజ్ఞాన వేదిక, నాటక పోటీలు వంటి వాటిని ప్రోత్సహించారన్నారు. అక్కడి అధ్యాపకులు ఉత్తమంగా బోధిస్తారని, సమాజంలో ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడతాయన్నారు. విద్యాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య, కార్యదర్శులు వెంకట శివారెడ్డి, బిఎస్ అరుణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి సుధాకర్ ఇస్తూరి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైసి కమల, అధ్యాపకబృందం తదితరులు పాల్గొన్నారు.

# నమ్మించి.. రూ.4 కోట్లకు టోకరా

● చక్కర వ్యాపారం పేరిట హడావుడి
● అధిక వడ్డీ చెల్లిస్తూ.. అప్పులకు వల
● వేరుశనగ, బియ్యం, పొట్టేళ్ల కొనుగోలు
● స్నేహితుల వద్ద బంగారం తీసుకుని..
● రెండు రోజుల క్రితం అదృశ్యం

**కదిరి/నల్లచెరువు, జులై 25:** నల్లచెరువు మండల కేంద్రానికి రెండు నెలల క్రితం వచ్చిన ఓ వ్యక్తి.. అద్దె గదిలో ఉంటూ.. అందరినీ నమ్మించి రూ.4 కోట్లకు టోకరా వేశాడు. చక్కెర వ్యాపారంతో ప్రారంభించి.. వేరుశనగ, బియ్యం, పొట్టేళ్లు.. ఇలా వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నట్లు నమ్మించాడు. అతని హంగు, ఆర్భాటం చూసి చాలామంది అప్పులు ఇచ్చారు. మొదట్లో వారానికి రూ.లక్షకు రూ.5 వేల దాకా వడ్డీ ఇచ్చి.. వల విసిరాడు. దీంతో అత్యాశకుపోయి అతనికి చాలామంది రూ.లక్షలకు లక్షలు అప్పులు ఇచ్చారు. నల్లచెరువుకు రెండు నెలల క్రితం వచ్చిన ఆ వ్యక్తి.. తన పేరు మహేశ్వర్‌రెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. నల్లచెరువు బస్టాండ్ ప్రాంతంలో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఆ గదికి కార్పొరేట్ హంగులు సమకూర్చుకున్నాడు. మొదట చక్కెర వ్యాపారం మొదలు పెట్టాడు. లారీల కొద్ది చక్కెరను తీసుకువచ్చి మండలకేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లో విక్రయించాడు. ఆయన వ్యాపార ఆర్భాటం చూసి, స్థానికంగా ఉన్న కొంతమంది చేరువయ్యారు. వారి నుంచి కొంత డబ్బు తీసుకోవడం.. వారం వారం రూ.లక్షకు రూ.5 వేల వడ్డీ చెల్లించాడు. ఇది చూసి మరికొందరు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇచ్చారు. ఇద్దరు వ్యాపారుల వద్ద ఆయన 80 బస్తాల బియ్యం తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలించాడు. ఒక లారీ లోడు వేరుశనగ కాయలు కొన్నాడు.

వివిధ గ్రామల్లో ఆరు వందల పొట్టేళ్లు కొనుగోలు చేశారు. వారంలోపు డబ్బులు చెల్లిస్తానని నమ్మించాడు. తన భార్య శుభకార్యానికి వెళుతోందని చెప్పి.. తనతో స్నేహం చేసిన ఇద్దరి నుంచి రెండు రోజుల క్రితం 20 తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడు. అంతే..! బుధవారం మాయమైపోయాడు. ఆయన సెల్ ఫోన్ నంబర్లు పనిచేయడం లేదు. దీంతో డబ్బులిచ్చిన వారు, లావాదేవీలు నడిపిన వ్యాపారులు కంగారుపడ్డారు. అతని కోసం గురువారం ఉదయం వరకు వివిధరకాలుగా ప్రయత్నించారు. ఆచూకీ లభించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి.. నల్లచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని డీఎస్పీ శ్రీలత దృష్టికి తీసుకెళ్లారు. మొత్తంగా అతను రూ.4 కోట్ల వరకూ టోకరా వేసినట్లు సమాచారం.

## పలు రైళ్ల దారి మళ్లింపు

**గుంతకల్లు, జులై 25:** సెంట్రల్ రైల్వేలోని డౌండ్ వద్ద జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా గుంతకల్లు మీదగా వెళ్లే పలు రైళ్లను దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ముంబై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 11301)ను ఈనెల 29వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 11302)ను ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకూ, అలాగే కన్యాకుమారి-పూనా ఎక్స్‌ప్రెస్ (నెం. 16382)ను ఈ నెల 28, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16381)ని ఈనెల 30, ఆగస్టు 1వ తేదీన పూనే, మీరజ్, కురుద్వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు. ముంబై-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16352)ను ఈ నెల 28న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16351)ని 29వ తేదీన, చెన్నై సెంట్రల్-ఏక్తా నగర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 20919)ను, ట్యుటుకోరిన్-ఓకా ఎక్స్‌ప్రెస్ (నెం. 19567)ను 28న, కరైకల్-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 11018)ను 29న, చెన్నై-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 22180) ను 30న, ముంబై-కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 11013) ఈ నెల 30, 31 తేదీల్లోనూ, కోయంబత్తూరు-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 11014)ను, నాగర్‌కోయిల్-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 16340)ను ఈ నెల 29, నుంచి 31వ తేదీ వరకూ, ముంబై-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16339)ని ఈ నెల 31, ఆగస్టు 1వ తేదీన గుంతకల్లు, బళ్లారి, హుబ్లి, మీరజ్, పూనే స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముంబై-మధురై ఎక్స్‌ప్రెస్ (నెం. 22101)ను ఈ నెల 31న, ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (నెం. 22159) రైలును ఆగస్టు1న పూనా, మీరజ్, కురుద్వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు వివరించారు.



### సేవాలాల్ జయంతి ఉత్సవాలకు
## రూ.50 లక్షలు ప్లీజ్

● సాధారణ బడ్జెట్‌లో కేటాయించాలి
● సీఎం చంద్రబాబునాయుడును కోరిన మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 25 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని గుత్తి మండలం సేవాఘడ్‌లో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. సాధారణ బడ్జెట్‌లో ఉత్సవాలకు నిధుల కేటాయింపులు చేయాలన్నారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబునాయుడును మంత్రి పయ్యావుల కేశవ్ కలిశారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్ జన్మించారన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నారన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, లక్షలాది మంది భక్తులు జన్మదిన వేడుకలకు హాజరై సేవాఘడ్‌లో మాతా జగదాంబ, సేవాలాల్ మహరాజ్‌కి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ జయంతి ఉత్సవాలకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఉత్సవాల సమయంలో రవాణా, ఆహారం, వసతి, ఇతర సౌకర్యాల కోసం సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు వివిధ రూపాల్లో రుణాలు తీసుకున్నారన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సీఎం కు గుర్తు చేశారు. బంజారాలకు కీలకమైన పండగ కావున, మరోసారి మంజూరు చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఫిబ్రవరిలో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు.

# భరతమాత ముద్దుబిడ్డలకు జోహార్

**హిందూపురం అర్బన్, జులై 25:** కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన సైనికులు భరతమాత ముద్దుబిడ్డలని బీజేపీ నాయకులు కొనియాడారు. కార్గిల్ దివాస్‌ను పురస్కరించుకుని గురువారం అమరవీరులను స్మరిస్తూ పట్టణంలో చిన్నమార్కెట్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కాగడాలతో ర్యాలీ చేపట్టారు. 'జయహో భారత్, జై జవాన్' నినాదాలతో హోరెత్తించారు. కార్గిల్‌ను, లడ్డాక్‌ను ఆక్రమించాలని పాకిస్థాన్ ఎత్తైన కొండ ప్రాంతం నుంచి తూటాలు పేలుస్తూ విశ్వ ప్రయత్నాలు చేసిందన్నారు. భారత సైనికులు వీరోచిత పోరాటం చేసి, వారిని తరిమి కొట్టారన్నారు. 4 వేల మంది శత్రు సైనికులను మట్టికరిపించారన్నారు. దేశం కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడిన వీరులను స్మరిస్తూ కాగడాలతో అఖండ ధర్మదీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శివ, బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ దేవేంద్ర, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### కూటమి నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

**ముదిగుబ్బ:** కార్గిల్ దివాస్‌ను పురస్కరించుకుని అమరవీరులకు స్థానిక బస్టాండు కూడలిలో కూటమి నాయకులు నివాళి అర్పించారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ.. 1999 మే 3 నుంచి జులై 26 వరకు కొనసాగిన కార్గిల్ యుద్ధంలో ఎంతో మంది సైనికులు అమరులయ్యారన్నారు. వారికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, జనసేన మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ సైనికుడు ఆలం అలీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.




### వజ్రాల వేటకు వెళ్లి మృత్యువాత

పాముకాటుకు గురైన అనంతపురం మహిళ



లక్ష్మీదేవి మృతదేహం

**మహానంది, జులై 25.** ఒక్క వజ్రం అయినా దొరకక పోదా? అనే ఆశతో వచ్చిన మహిళ పుల్లా లక్ష్మీదేవి(58) పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ సంఘటన గురువారం నంద్యాల జిల్లా మహానంది మండలం ఆంజనేయపురంలో జరిగింది. 10 రోజుల క్రితం మండలంలోని సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలో ప్రవహించే వాగులో వజ్రల వేట కోసం అనంతపురం పాతూరుకు చెందిన పుల్లా లక్ష్మీదేవితో పాటు మరి కొందరు వెళ్లారు. బుధవారం ఆంజనేయపురంలో విడిది చేసే ప్రాంతానికి లక్ష్మీదేవి చేరుకుంది. తన వెంట తెచ్చుకొన్న బ్యాగులోంచి బట్టలు తీసుకొనేందుకు తెరిచే సరికి అప్పటికే బ్యాగులో ఉన్న పాము ఆమెను కాటు వేసింది. ఆమెతో వచ్చిన వారు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఆమె మృతి చెందింది. గురువారం కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

# ఎక్కడైనా రాణించేలా నైపుణ్యం సాధించండి

● రేవా కోర్సుల ప్రారంభంలో అమన్‌గుప్త పిలుపు

**బెంగళూరు, జులై 25 (ఆంధ్రజ్యోతి):** దేశంలో సాంకేతిక విద్యకు కొదవలేదని ప్రపంచంలో ఎక్కడైనా రాణించాలంటే సమగ్ర నైపుణ్యత ముఖ్యమని ఆ దిశగా విద్యార్థులు లక్ష్యంతో చదవాలని బోట్ లైఫ్‌స్టైల్ కో ఫౌండర్ అమన్‌గుప్త అభిప్రాయపడ్డారు. రేవా యూనివర్సిటీలో బుధవారం సాంకేతికేతర కోర్సులను కొత్త బ్యాచ్‌లను ఓరియంటేషన్ కార్యక్రమానికి రేవా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ పీ శ్యామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమన్‌గుప్త మాట్లాడుతూ ఇప్పటి విద్యార్థులు చూస్తుంటే స్ఫూర్తి వస్తోందన్నారు. కళాశాల రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. సీఏ పూర్తి చేసి ఆ తర్వాత ఏం చేయాలనేది ఆలోచించానన్నారు. భవిష్యత్తు గురించి ఎటువంటి సూచనలు ఉండేవి కావన్నారు. ఐదు స్టార్టప్‌లను ప్రారంభించానని వాటిలో ఎటువంటి విజయం సాధ్యం కాలేదన్నారు. ఇలాంటి వైఫల్యాల తర్వాతనే బోట్ లైఫ్‌స్టైల్ ఆరంభించానని, ప్రస్తుతం యువతకు బోట్ లైఫ్‌స్టైల్‌పట్ల ఆసక్తి, వారి జీవనశైలిలో ఒకభాగంగా మారిందన్నారు. ఒకప్పటిలా చదువు నేటి ఆధునిక యుగానికి సరిపోదని నైపుణ్యతతోనే భవిష్యత్తు సాధ్యమన్నారు. రేవా చాన్స్‌లర్ పీ శ్యామరాజు ప్రసంగిస్తూ రేవాలో కేవలం అర్హతకోసమే కాకుండా నైపుణ్యత, విద్యా జ్ఞానాన్ని, జ్ఞాన సముపార్జన పెంచేలా తీరుస్తున్నామన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఆత్మవిశ్వాసంతో సాధించే విద్యార్థులు కావాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రో-చాన్స్‌లర్ ఉమేశ్ ఎస్‌రాజు, రిజిస్ట్రార్ రమేశ్, ప్రొ వైస్ చాన్స్‌లర్‌లు డాక్టర్ ఆర్‌సి బిరాదార్, డాక్టర్ శుభ, సంజయ్ చట్నీస్‌లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో రేవా వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ పీ శ్యామరాజు తదితరులు